క్లుప్తంగా

ప్రజా సమస్యను తీర్చాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో రేషన్ సర్వర్ల మొరాయింపుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యకు పరిష్కారం చూపాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో పోస్ట్ మిషన్‌లో వేలిముద్రలు పడక రేషన్ కార్డుదారులు ఆందోళన చెందుతున్నారని, ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రజల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

పాఠశాల అభివృద్ధి ప్రదాతలకు సన్మానం



పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన వారిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక లక్ష్మీవారపు పేటలోని ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (ఏఆర్‌డీజీకే) మున్సిపల్ హైస్కూల్ అభివృద్ధికి కృషి చేసిన పలువురిని స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యాన మంగళవారం సన్మానించారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సరఫరా కోసం సబ్ మెర్సిబుల్ మోటార్‌తో పాటు వివిధ వస్తువులను అందజేసిన క్లబ్ ప్రతినిధులతో పాటు సైకిల్ షెడ్డు నిర్మించిన ఏనుగుల మల్లేశ్వరరావు, పాఠశాల పూర్వ విద్యార్థులు విజయవాడ లయన్స్ క్లబ్ రీజినల్ కార్యదర్శి రుత్తల లలిత కుమారి, స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు నున్న వెంకట గంగాభవాని, ప్రస్తుత అధ్యక్షురాలు లక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని డీఎస్ ఉజ్వల, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వి.కాంతి జయకుమార్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి



పత్రాలను చూపుతున్న మాజీ అధ్యక్షుడు నాగభూషణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు టౌన్ ఆటో మొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాగంటి నాగభూషణం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్‌కు అడహక్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత 227 మంది ఓటర్లతో జాబితా విడుదల చేసిన కమిటీ రాత్రికిరాత్రి జాబితాలో మరింత మందిని చేర్చి 312 మందితో మరో జాబితాను తెరపైకి తీసుకువచ్చిందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎన్నికల షెడ్యూలు ప్రకారం ఏదీ నిర్వహించడం లేదన్నారు. ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తుది జాబితా విడుదల చేసే వరకూ ఎన్నికలను నిలువరించాలని కోరారు.

వాహనాల పంపిణీ పథకంపై విచారణ చేయాలి

దెందులూరు: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇన్నోవా వాహనాల పంపిణీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ నిర్వహించాలని మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీ డిమాండ్ చేశారు. మంగళవారం ముప్పవరంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు నీళ్లు వదిలి, అర్హతా ప్రమాణాలను తుంగలో తొక్కి దాదాపు వందలాది ఇన్నోవా వాహనాలను చంద్రబాబు స్టిక్కర్లు వాహనాలపై వేయించుకుని సబ్సిడీ రుణాలపై మంజూరు చేశారన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు తక్షణమే విచారణ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



ఏలూరు రూరల్: పైడిచింతపాడులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు



ఏలూరు రూరల్: పైడిచింతపాడులో నిర్వహించిన వైద్య శిబిరంలో మహిళల అనారోగ్య సమస్యలు తెలుసుకుంటున్న వైద్యులు

- ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు
- పైడిచింతపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ఏలూరు రూరల్: విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పేదలను అభివృద్ధి వైపు నడిపించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఏలూరు మండలం కొల్లేరు గ్రామం పైడిచింతపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా మెరుగుపడ్డారని గుర్తు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు లక్షా 30 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు ఇచ్చారని కొనియాడారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. నాడు–నేడు పథకంతో కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ బడులు అభివృద్ధి చేసి, పేద పిల్లలకు విద్య అందిస్తున్నారని వివరించారు. ఎంపీడీఓ బి.ప్రణవి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముంగర తిమోతి, పార్టీ నాయకుడు ముంగర సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

198 మంది రోగులకు సేవలు

ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వైద్య శిబిరానికి 198 మంది రోగుల వచ్చారు. వీరికి వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది పలు రకాల పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

మానసిక వికలాంగులను ఆదరించండి



తంగెళ్లమూడిలోని మానసిక వికలాంగుల హోమ్‌ను పరిశీలిస్తున్న కేకేవీ బుల్లి కృష్ణ

ఏలూరు (టూటౌన్): మానసిక వికలాంగులను ప్రేమతో ఆదరించాలని, వారి అవసరాలను తెలుసుకుని తీర్చాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బుల్లి కృష్ణ కోరారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన స్థానిక తంగెళ్లమూడిలోని మిషనరీ ఆఫ్ చారిటీ హోమ్‌ను సందర్శించారు. హోమ్‌లో మానసిక వికలాంగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. యాజమాన్యంతో మాట్లాడుతూ వారికి అందుబాటులో ఉన్న వైద్య, రక్షణ సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. కుటుంబ సభ్యులకు ఎటువంటి న్యాయ సహాయం కావాల్సినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందజేస్తుందని తెలియజేశారు. హోమ్ పరిపాలనాధికారి సంస్థ నిర్వహణను వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి నిండా నిద్రతో మానసిక ఆరోగ్యం

ఏలూరు రూరల్: కంటి నిండా నిద్ర మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని మానసిక వైద్యులు బీఆర్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి నిలపాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ 8 గంటలు నిద్రపోవాలన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో కేసీహెచ్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర రజకుల సమస్యలను పరిష్కరించాలి



అభివాదం చేస్తున్న రజక నేతలు

ఏలూరు (టూటౌన్): ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం నుంచి వచ్చి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థిరపడిన రజకుల సమస్యలను పరిష్కరించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. ఉత్తరాంధ్ర రజకుల సమావేశం స్థానిక జిల్లా కార్యాలయం నందు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం తమ జీవన భృతి కోసం ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అపార్టుమెంట్లులో వాచ్‌మెన్‌లుగా, ఆటో డ్రైవర్లుగా, తాపీ పనివారిగా రజకులు జీవనం సాగిస్తున్నారన్నారు. చాలా చోట్ల వీరికి అవమానాలు జరుగుతున్నాయని అన్నారు. వీరిని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక చాణక్యపురి కాలనీ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చల్లపల్లి సుబ్బారావు, ఉపాధ్యక్షునిగా పురుపల్లి సత్యనారాయణ, కార్యదర్శిగా గుమ్మ సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా చీపురుపల్లి శ్రీకాంత్, కోశాధికారిగా బాలుడు సింహాచలంతో పాటు ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని రజక సంఘ నాయకులు వట్లూరు మురళి, వి.శ్రీనివాసు, వీర్రాజు తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

వెలుగు వీవోఏ, మెప్మా ఆర్పీల ఆందోళన

ఏలూరు (టూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెలుగు వీవోఏలు, మెప్మా ఆర్పీలు ఏలూరు కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం పగలు ధర్నా చేసి, రాత్రి అక్కడే టెంట్‌లో నిద్రించారు. మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేయాలని, గ్రేడింగ్ పద్ధతి వెనక్కి తీసుకోవాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూపుల విలీనం ఆపాలని కోరుతున్నారు. ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణీ మాట్లాడారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత సీఎం జగనన్న లక్ష్యం



పూళ్లలో పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతకు వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం ఆరోగ్య నిధి నుంచి రూ.50లక్షలతో చేపట్టనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ పూళ్ల పీహెచ్‌సీని అభివృద్ధి చేయడం ద్వారా కొల్లేరు ప్రాంతాల్లో ప్రజలకు సత్వర వైద్య సేవలు అందుబాటులో వస్తాయన్నారు. ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, ఎఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, ఉపాధ్యక్షుడు పులి చర్ల వెంకటకృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు,కురెళ్లగూడెం సర్పంచ్ గుడివాడ గౌతమి సీతారామాంజనేయులు, ఎంపీటీసీలు బొల్లారపు జ్ఞానరమ్య పవన్, గంటా శ్రీనివాసరావు, పొల్నాటి శ్రీను, డీఈ హౌసింగ్ యు.సోమేశ్వరరావు, ఏఈ సీహెచ్ సతీష్, వైద్యులు బి.లీలాప్రసాద్ పెద్దలు పుప్పాల రామ్మోహనరావు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్ స్వీపర్ల దీక్షల విరమణ



జీతాల విడుదలపై హామీ ఇస్తున్న డీఈఓ శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మున్సిపల్ స్కూల్ స్వీపర్లు 5 నెలల బకాయి జీతాల కోసం ఈనెల 3వ తేదీ నుంచి ఏలూరు డీఈవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలను మంగళవారం సాయంత్రం విరమించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు డీఈవో, మున్సిపల్ కమిషనర్లు సంప్రదించుకుని మున్సిపల్ కమిషనర్ ద్వారా స్కూల్ స్వీపర్ల 5 నెలల బకాయి జీతాలు చెల్లించేందుకు హామీ ఇచ్చారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు మున్సిపాల్టీ చెల్లించిన జీతాల డబ్బులను విద్యాశాఖకు బడ్జెట్ రాగానే తిరిగి చెల్లించేందుకు(రీయింబర్స్‌మెంట్) ఒప్పందం ప్రాతిపదికన ఈ జీతాల చెల్లింపు చేపడుతున్నట్లు డీఈవో, మున్సిపల్ కమిషనర్లు వెల్లడించారు. ఈ మేరకు డీఈవో పి.శ్యామ్‌సుందర్ మంగళవారం దీక్షా శిబిరం వద్దకు విచ్చేసి ఆందోళనకారులకు రాతపూర్వకమైన ఉత్తర్వుల కాపీ అందజేశారు. దానిని మున్సిపల్ కమిషనర్ అమలు చేసేందుకు అంగీకరించారు. ఈ హామీ ప్రకారం గత 8 రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలను విరమించినట్లు యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.సోమయ్య తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	37
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	37
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	25

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి కిరణ్మయి

గణపవరం: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య కేంద్రాల్లోనే పురుడు పోసుకోవాలని, ప్రతి నెలా 9, 10 తేదీల్లో పీహెచ్‌సీలో నిర్వహించే గర్భిణులు వైద్య పరీక్షలకు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఈ సందర్భంగా 69 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలి



వెల్లమిల్లి ఆర్‌బీకేలో ఆధునిక యంత్రాలను పరిశీలిస్తున్న వీరపాండ్యన్, జేసీ బి.లావణ్య దేవి

ఉంగుటూరు: రాష్ట్రంలో సార్వా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ వీర పాండ్యన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 37 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేశామని, దీనిపై అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. వెల్లమిల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఆయన ధాన్యంలో తేమను నిర్ధారించే యంత్రాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం జిల్లాస్థాయి అధికార్లు, కొంతమంది మిల్లర్లుతో ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీరపాండ్యన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులను ఇబ్బందులు పెట్టకూడదని అన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. జేసీ లావణ్య దేవి అధికార్లకు ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణ, జిల్లా సివిల్ సప్లై అధికారి సత్యనారాయణ రాజు, ట్రాన్సుపోర్టు కమిషనర్ పాల్గొన్నారు.

పేదలకు భూమి పంపిణీ చేయాలి



ఏలూరులో నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): భూమిలేని పేదలకు భూములు పంపిణీ చేయాలని, అసైన్డ్ సీలింగ్ గయ్యాల భూములను పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. ఏలూరు వసంత మహల్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యాన మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుంచి ప్రభుత్వ భూములను అక్రమంగా అమ్మేసిన భూ స్వాములే సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, టి.ముత్యాలమ్మ, ఎస్.ముహంకాళిరావు, సహాయ కార్యదర్శి యు.వెంకటేష్ , రాజమండ్రి డానియేల్, ఎం.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లులో బీసీల వాటా తేల్చండి



జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో సమావేశమైన బీసీ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీల వాటా లెక్క తేల్చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు కోరారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీహార్‌లో మాదిరిగా సమగ్ర బీసీ కులగణన చేపడతామన్న రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. గతానికి భిన్నంగా నాలుగేళ్లుగా రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే ఏలూరులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో బీసీలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నింటా బీసీలకు అండదండలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అన్నా రామచంద్ర యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నత్తా రవీంద్ర, యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ విఠల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూదాలకు బానిసలు కావొద్దు

టూటౌన్ సీఐ చంద్రశేఖర్



బెట్టింగ్ రాయుళ్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ చంద్రశేఖర్

ఏలూరు టౌన్: క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతూ అప్పుల పాలవుతున్నారని, జూదాలకు బానిసలుగా మారొద్దని ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ హితవు పలికారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏలూరు టూటౌన్ పరిధిలో గతంలో క్రికెట్ బెట్టింగులకు పాల్పడిన వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్సై శుభశేఖర్ పాల్గొన్నారు. అలాగే ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ కూడా త్రీటౌన్ పరిధిలో క్రికెట్ బెట్టింగులకు పాల్పడేవారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఏలూరు అర్బన్ తహసీల్దార్ వద్ద వారందరిపై బైండోవర్ కేసులు నమోదు చేయించారు. బెట్టింగులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని సీఐ చెప్పారు.

ఏపీటీఎఫ్ నూతన అధ్యక్షుడిగా ప్రసాద్

నిడమర్రు: ఉపాధ్యాయ సంఘం ఏపీటీఎఫ్ నిడమర్రు మండల శాఖ నూతన అధ్యక్షుడిగా నిడమర్రు జెడ్పీ స్కూల్ పాఠశాల సహాయకులు ఐవీవీఎస్ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల పరిశీలకుడు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రంగా వలి తెలిపారు. మంగళవారం బువ్వనపల్లి యూపీ స్కూల్లో ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన కమిటీని ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా నాయుడు కొండయ్య, ఉపాధ్యక్షురాలిగా లలితకుమారి తదితర 12 సభ్యులు ఎన్నికైనట్టు రంగావళి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎన్‌జేపీ నారాయణ, కణితి కృష్ణకుమార్, భీమేశ్వర రావు, మద్దా వెంకటరత్నం తదితరులున్నారు.